క్లుప్తంగా

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

రేగొండ: షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలుచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిశిధర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్‌రావు, బుచ్చిరెడ్డి, పెండ్యాల రాజు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



కాళేశ్వరం: మహదేవపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు ఆకుల శ్రీధర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి పలువురు గురువారం బీజేపీలో చేరారు. బీఆర్ఎస్ మాజీ వార్డు సభ్యుడు బీముని వెంకటస్వామి, జల్లారపు పాపయ్యలకు జిల్లా అధ్యక్షుడు నిశిధర్ రెడ్డి మండల కేంద్రంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపెల్లి పాపయ్య, మంథని అసెంబ్లీ కన్వీనర్ మల్కామోహన్ రావు, మండల సీనియర్ నాయకులు కన్నెబోయిన ఐలయ్య, ఆడప లక్ష్మి నారాయణ, కొత్త పోశం పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమ్మె



కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులు గురువారం సమ్మె చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాపురం(కె): ఓపెన్ స్కూల్ పదో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 8వ తేదీ నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం జీవీవీ సత్యనారాయణ గురువారం తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు ఆధార్ కార్డు జిరాక్స్, కుల ధ్రువీకరణ పత్రం, టీసీతో జిల్లా పరిషత్ పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

ఏటూరునాగారం: నేడు(శుక్రవారం) ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం ఏటూరునాగారం బస్టాండ్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ఆదివాసీ సంఘాలు నాయకులు, ప్రజలతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐటీడీఏ కార్యాలయావరణలో ప్రాజెక్ట్ అధికారి చిత్రమిశ్ర ఆధ్వర్యంలో కొమురం భీం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి జెండా ఆవిష్కరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐటీడీఏ ప్రాంగణంలోని కొమురం భీం విగ్రహాన్ని ముస్తాబు చేస్తున్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కొప్పుల రవి, పాడె శోభన్, పులిశె బాలకృష్ణ తదితరులు పిలుపునిచ్చారు.

'అపెరల్'కు ఉపాధి కరువు

ఏడాదికి మూడు నెలలే ఉపాధి

- ప్రోత్సాహం కోసం మహిళల ఎదురుచూపు



దుస్తులు కుడుతున్న మహిళలు

మల్హర్: గ్రామీణ ప్రాంతంలో స్వయం ఉపాధి కల్పన కోసం ఏర్పాటు చేసిన జయశ్రీ ఐఏపీ మినీ అపెరల్ యూనిట్ కుట్టు మిషన్ కేంద్రానికి ఉపాధి కరువవుతోంది. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో ఆర్డర్లు సక్రమంగా రాక నిర్వహణ కష్టంగా మారుతుంది. మండలంలోని తాడిచర్ల ఐఏపీ నిధులతో 2013 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్ స్మితాసబర్వాల్ అపెరల్ యూనిట్‌ను ప్రారంభించారు. యూనిట్ నిర్వహణకు 25 కుట్టు మిషన్లు, రూ.50వేలతో పాటు కటింగ్, ఖాజామిషన్, కత్తెర్లు, కటింగ్ బల్లలను అందజేశారు. గ్రామంలోని కుట్టు మిషన్‌లో నైపుణ్యం ఉన్నా 20 మందిపైగా మహిళలు అపెరల్ యూనిట్ ద్వారా ఉపాధి పొందుతోన్నారు.

మూడు నెలలు మాత్రమే ఉపాధి

ఏడాదిలో కేవలం మూడు నెలలు ఈ కేంద్రం ద్వారా ఉపాధి కల్గుతుందని నిర్వాహకులు తెలుపుతున్నారు. గతంలో ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల నుంచే కాకుండా మంథని, ముత్తారం నుంచి ప్రభుత్వ విద్యార్థులకు దుస్తులు కుట్టడానికి ఆర్డర్లు వచ్చేవని, ప్రస్తుతం రావడం లేదని వారు తెలుపుతున్నారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలతో పాటు డివిజన్ పరిధిలోని ఇతర మండలాల ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థుల దుస్తులను అప్పగించినట్లయితే ఏడాదిపాటు ఉపాధి ఉంటుందని వారు తెలుపుతున్నారు.

సరిపోని కమీషన్

యూనిట్ ప్రారభించిన ఏడాది నిర్వహణకు రూం అద్దె, ముడి సరుకు, విద్యుత్ సౌకర్యం కింద రూ.50వేలు వచ్చాయి. తర్వాత ఇప్పటి వరకు ఐఏపీ ద్వారా ఒక్క రూపాయి కూడా రాకపోవడంతో వచ్చే కమీషన్ నిర్వహణ ఖర్చులకే సరిపోతున్నాయని నిర్వాహకులు తెలుపుతున్నారు. ప్రభుత్వం ఒక్కో డ్రెస్సుకు రూ.40 కమీషన్ చెల్లిస్తుంది. విద్యార్థులకు డ్రెస్సుకు సంబంధించిన బట్టలను కుట్టడం నుంచి డ్రెస్సులను ఆయా పాఠశాలలకు తరలించడానికి రవాణా ఖర్చులు అన్ని కలిపి రూ.25 ఖర్చవుతుండగా వచ్చే డబ్బులు ఒక్కోకరికీ కనీసం రూ.5వేలు కూడా రావడం లేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్వయం ఉపాధితో జీవనం కొనసాగిస్తున్నా తమకు ఇతర ఉపాధి అవకాశాలు కల్పించాలని నిర్వాహకులు తెలిపారు.

ఉపాధి అవకాశాలు పెంచాలి



రోజు రోజుకు అపెరల్ యూట్‌కు ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. యూనిట్ ప్రారంభంలో వివిధ మండలాల నుంచి 5వేల పైచిలుకు మెటీరియల్ వచ్చింది. ప్రస్తుతం మూడు సంవత్సరాల నుంచి మెటీరియల్ తగ్గుతువస్తోంది. దీంతో కుటుంబ పోషణ మారంగా మారుతుంది. ప్రభుత్వం స్పందించి సంవత్సరా కాలం పాటు ఇతర ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

– బొంతల సరిత, తాడిచర్ల, మల్హర్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- చిట్యాల మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న శ్రీదేవి

చిట్యాల: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా గుమ్మడి శ్రీదేవి, వైస్ చైర్మన్‌గా ఎండీ.రఫీతో పాటు పాలకవర్గ సభ్యులను మార్కెట్ కమిటీ సెక్రటరీ కనక శేఖర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి పాలకవర్గ సభ్యులతో కలిసి శక్తి వంచన లేకుండా కష్టపడి పనిచేస్తానని తె లిపారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. రైతులను ఆదుకునేందుకు ఆగస్టులోగా పూర్తిగా రుణమాఫీ చేయనున్నట్లు చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి ప్రజలకు అండగా నిలుస్తామని అన్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు కలిసికట్టుగా పనిచేసి మార్కెట్ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. నిజాయితీగా పరిపాలన అందించాలని.. మండలంలో ఎక్కడైనా పేదల దగ్గర నుంచి ఒక్క రూపాయి తీసుకున్నా సహించేది లేదని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని రోడ్లను బాగుచేస్తానని అన్నారు. గాంధీనగర్‌లో రూ.176 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాలకు త్వరలోనే పునాది రాయి వేస్తానని హామీఇచ్చారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మండలకేంద్రంలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. చిట్యాల, ఒడితలలో పల్లె దవాఖానాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు గాజర్ల అశోక్ (ఐతు), రాంనర్సింహారెడ్డి, సంపత్‌రావు, దబ్బెట రమేష్, మధువంశీకృష్ణ, అప్పం కిషన్, చల్లూరి మధు, మాజీ జెడ్పీటీలు పులి తిరుపతిరెడ్డి, కాంట్రేవుల సాయిలు, ఒరం సమ్మయ్య, కిష్టయ్య, కొంరయ్య, దబ్బెట అనిల్, రాజ్‌మహ్మద్ పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకోవాలి



మాట్లాడుతున్న నిశిధర్‌రెడ్డి

భూపాలపల్లి రూరల్: జిల్లా వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలని, స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయులను స్మరించుకోవాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్ రెడ్డి సూచించారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో హర్ ఘర్ తిరంగా(ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయడం)పై ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో నిశిధర్ రెడ్డి మాట్లాడారు. పార్టీ ఆదేశానుసారం స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగపూరి రాజమౌళి గౌడ్, వెన్నంపల్లి పాపన్న, యుగందర్, లింగంపల్లి ప్రసాద్‌రావు, మోర రవీందర్ రెడ్డి, మోహన్ రావు, బట్టు రవి, జున్ను మొగిలి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని జంగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంఘమిత్ర డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ గురువారం కంప్యూటర్‌ను బహూకరించారు. కళాశాల కరస్పాండెంట్ గుర్రపు రవీందర్ ఆదేశానుసారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్‌కు కంప్యూటర్ అందజేసినట్లు ప్రిన్సిపాల్ హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం డిగ్రీ కళాశాల యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల వసతులు కల్పనకు దాతలు ముందుకు రావాలని ప్రధానోపాధ్యాయుడు విజ్ఞప్తి చేశారు.



కంప్యూటర్‌ను అందజేస్తున్న హరికృష్ణ

దిగబడిన వాహనాలు.. నిలిచిన రాకపోకలు



రహదారిపై నిలిచిన వాహనాలు

కాటారం: కాటారం–మంథని ప్రధాన రహదారి రోడ్డులో వాహనాలు దిగబడి గురువారం మంథని వైపుగా సుమారు నాలుగు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. కాటారం నుంచి ధన్వాడ వరకు కొన్ని రోజులుగా ప్రధాన రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. విస్తరణ పనుల్లో భాగంగా ఓ పక్క మెటల్ గ్రావెల్ పనులు కొనసాగిస్తుండగా మరో పక్క రోడ్డు మట్టి లోతుగా తీశారు. కాగా, వర్షాల కారణంగా రహదారి బురదమయంగా మారడం, వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో నిత్యం వాహనాలు బురదలో దిగబడుతున్నాయి. ఈ క్రమంలో తెల్లవారుజామున ధన్వాడలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీపంలో పలు వాహనాలు బురదలో కూరుకుపోయాయి. ఉదయం వరకు వాహనాలు అలాగే బురదలో ఉండటంతో మిగితా వాహనాలు వెళ్లే పరిస్థితి లేక ట్రాఫిక్ జాం అయింది. ఆర్అండ్‌బీ అధికారులు, రోడ్డు కాంట్రాక్టర్ శ్రమించి ప్రొక్లెయినర్ సాయంలో బురదలో కూరుకుపోయిన వాహనాలను బయటకు తీసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కొంత సమయం పాటు వాహనాలను అటువైపుగా అనుమతించకుండా భూపాలపల్లి వెళ్లే వాహనాలను కొయ్యూర్, ఎడ్లపల్లి, రుద్రారం మీదుగా మళ్లించారు. కాళేశ్వరం వైపుగా వెళ్లే వాహనాలను గంగారం మీదుగా పంపించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కాటారం: మురికి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయిస్తున్న అధికారులు



కాళేశ్వరం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి సత్యనారాయణ

కాటారం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిని మౌనిక సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని మజీద్‌వాడలో వైద్య సిబ్బంది గురువారం పర్యటించారు. పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్‌తో కలిసి డ్రెయినేజీలు, మురుగు గుంటల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ప్రజలకు స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన కల్పించారు. అలాగే మండలంలోని దామెరకుంటలో వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఇంటింటా తిరిగి జ్వర సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుమన్, హెచ్‌ఈఓ తిరుపతిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, శ్యామల, ఆశాలు సమ్మక్క, రుక్సానా, రజిత, శైలజ, వసంత, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా డ్రైడే కార్యక్రమాన్ని వైద్యాధికారి సుస్మిత ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుస్మిత మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, వాటి లక్షణాలు అవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జ్వరం వస్తే ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం అందుబాటులో ఉందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమ్య, పీహెచ్ఎన్ నీరజ, హెల్త్ అసిస్టెంట్ అడప రాజరమణయ్య, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, స్టాఫ్‌నర్స్ కీర్తి, స్వరూప, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, ఏఎన్ఎం రాజమణి, అంగన్‌వాడీ టీచర్ జగదీశ్వరీ, ఆశవర్కర్లు శ్రీలత, సుశీల పాల్గొన్నారు.



మహాముత్తారం: నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్యసిబ్బంది

మహాముత్తారం: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో గురువారం వైద్యసిబ్బంది ఇంటింటా తిరుగుతూ నీటి నిలవ్వలను తొలగించారు. గ్రామంలో సర్వే చేసి జ్వరపీడితులను గుర్తించారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణు, వైద్యాధికారి సందీప్‌రావు, సూపర్‌వైజర్ హేమలత, ఏఎన్ఎమ్ సరోజన, వైద్యసిబ్బంది ఉన్నారు.

'ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు'

ఏటూరునాగారం: విద్యార్థులు తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ర్యాగింగ్ పేరుతో తోటి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించడం సరికాదన్నారు. ర్యాగింగ్ చేయడం నేరమని, ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. సీనియర్స్, జూనియర్స్ అనే తేడా లేకుండా స్నేహపూర్వకంగా కలిసి విద్యనభ్యసించాలని సూచించారు.

గోవిందరావుపేట: ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. పస్రా ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఆయన ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, తోటివిద్యార్థులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయొద్దని తెలిపారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులుగా ఉన్న సమయంలో కేసులు నమోదైతే ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేట్ ఉద్యోగాలు సాధించే సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. విద్యాసంస్థ యజమానులు విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు. ఎటువంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలి

భూపాలపల్లి రూరల్: గతంలో పూర్తి స్థాయిలో విచారణ చేసి అర్హులుగా గుర్తించిన వారికే డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు గురువారం కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలోని భాస్కర్ గడ్డ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను గతంలో పూర్తి స్థాయిలో విచారణ చేసి అర్హులైన 393 మందికి కేటాయించినట్లు తెలిపారు. కానీ ప్రస్తుతం ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నాయకులతో లబ్ధిదారుల లిస్టు తయారు చేయించి ఎలాంటి విచారణ చేయకుండా 416 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల జాబితాను కలెక్టర్‌కు పంపించినట్లు తెలిపారు. వాటిని పూర్తి స్థాయిలో జిల్లా స్థాయి అధికారులతో పారదర్శకంగా విచారణ చేయించిన తరువాతనే అర్హులైన లబ్ధిదారులకు చెందే విధంగా భాస్కర్ గడ్డ ఇళ్లను కేటాయించాలన్నారు. ఈ విషయంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి తప్పకుండా విచారణ చేయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు నూనె రాజు, మంగళ పెళ్లి తిరుపతి, ముంజంపల్లి మురళి, సమ్మయ్య, నాయకులు సిద్ధు, మేకల మల్లేశ్, కరాటే శ్రీనివాస్, రాజమల్లు తదితరులు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కాటారం: మండలంలోని గుమ్మాళ్లపల్లికి చెందిన పోటు సమ్మిరెడ్డి ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మృతుడితో కలిసి 1988–89 సంవత్సరంలో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి శాంతికేతన్ ప్రాథమిక పాఠశాలలో ఏడవ తరగతి చదువుకున్న బాల్య స్నేహితులు పరామర్శించారు. తమ వంతు సాయంగా రూ.18 వేల ఆర్థిక సాయం అందజేశారు. 1988–89 బ్యాచ్ అధ్యక్షుడు బియ్యాల ఉపేందర్, సెక్రటరీ ఏదుల శ్రీనివాస్, ఆదిరెడ్డి, బీడీ రాజు, గాదె సత్యం, పానుగంటి కృష్ణ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

ప్రజలతో మమేకమవుతూ ముందుకు..



కాటారం: సైకిళ్లు, క్రీడాకిట్లు, కుట్టు మిషన్లు అందజేస్తున్న పోలీసులు



మహాముత్తారం: వాటర్ ట్యాంకులు పంపిణీ చేస్తున్న పోలీసులు

కాటారం: సీఆర్పీఎఫ్ బలగాలు ప్రజలతో మమేకమవుతూ దేశ అంతర్గత భద్రత, రక్షణ విధుల్లో ముందుకు వెళ్తున్నట్లు సీఆర్పీఎఫ్ 58వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సంజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని అయ్యప్ప ఫంక్షన్‌హాల్‌లో గురువారం సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో కమాండెంట్ మోహన్ ఆదేశాలతో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. విద్యార్థులకు సైకిళ్లు, వాలీబాల్, బాస్కెట్‌బాల్ కిట్లు, క్యారంబోర్డు, నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు, కాటారం ఆరోగ్య కేంద్రం, ఎర్రగుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి, ప్రతాపగిరి గ్రామ పంచాయతీకి వాటర్ ట్యాంక్‌లు అందజేశారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో శాంతి నెలకొల్పే విధంగా సీఆర్పీఎఫ్ బలగాలు బాధ్యతతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది సివిక్ యాక్షన్ ప్రోగ్రాం చేపడుతూ పేదలకు తమవంతుగా తోడ్పాటును అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ యువత చెడు మార్గాలు, చెడు వ్యసనాలకు అలవాటుపడకుండా భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో నిలువాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వీర్పాల్‌సింగ్, సబ్ ఇన్‌స్పెక్టర్ మీనా, బాబుసింగ్, జవాన్లు హనుమాంతరెడ్డి, మనోహర్, గణేశ్, జవాన్లు పాల్గొన్నారు.

గొత్తికోయలగూడెంలో సివిక్ ప్రోగ్రాం

మహాముత్తారం: సీఆర్పీఎఫ్ సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా 58వ బెటాలియన్‌కు చెందిన కమాండెంట్ ఎం మోహన్ సహకారంతో కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఆర్పీఎఫ్ డీఎస్పీ రామకృష్ణన్ పరివేక్షణలో గురువారం సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. మండలంలోని సింగారం గ్రామ పంచాయతీ పరిధిలోగల మద్దిమడుగు గొత్తికోయల గుంపులో నిర్వహించిన సివిక్ ప్రోగ్రాంలో భాగంగా గొత్తికోయలకు వాటర్ ట్యాంకులు, సోలార్‌లైట్లు, మహిళలకు కుట్టుమిషన్లు, దుస్తులు, సైకిళ్లతో పాటు యువతకు వాలీబాల్ తదితర ఆటవస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్‌కుమార్ మాట్లాడుతూ.. గుంపులోని చిన్నారులను పనులకు పంపకుండా పాఠశాలకు పంపించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. అదే విధంగా వర్షాకాలం కావడంతో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అసాంఘిక శక్తులకు, అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని సూరవీడు గ్రామానికి చెందిన రాజేశ్‌కు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును గురువారం వారి కుటుంబ సభ్యులకు పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహనరావు, మాజీ జెడ్పీటీసీ పాయం రమణ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, నాయకులు బాలసాని వేణు, మద్దుకూరి ప్రసాద్, గోవింద్, చిడెం ముత్తయ్య తదితరులు ఉన్నారు.